సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 54 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 11.06.2025



## ఢిల్లీలో మకాం వేసిన

# సీఎం రేవంత్

- మంత్రులకు శాఖల కేటాయింపులపై కసరత్తు
- కొందరు మంత్రుల శాఖల మార్పుపైనా చర్చ
- కేసీ వేణుగోపాల్, ఖర్గేలతో సీఎం మంతనాలు
- హైకమాండ్ పిలుపు రావడంతో హుటాహుటిన వెళ్లిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మన చౌరాస్తా :**

తెలంగాణ మంత్రుల శాఖల్లో భారీ మార్పులకు అవకాశం ఉన్నట్లు సమాచారం. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుతో పాటు శాఖల మార్పులపైన కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రెండురోజులుగా ఢిల్లీలోలో మకాం వేసిన సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఢిల్లీ నుంచి పిలుపు రావడంతో ఆయన హుటాహుటిన ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఇక సోమవారం కాంగ్రెస్ కార్యదర్శి కేసీ వేణుగోపాలతో గంటకుపైగా రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి బేటి అయ్యారు. ఖర్గేతో భేటీ తరువాత మంత్రుల శాఖల మార్పులు ఖరారు కానున్నాయి సమాచరం. అలాగే కొత్త మంత్రులకు కూడా శాఖల కేటాయింపు జరుగుతుంది. ఈ క్రమంలో ప్రస్తుతం వివిధ శాఖలను నిర్వహిస్తున్న మంత్రుల శాఖల్లో కూడా మార్పులు చోటుచేసుకుంటాయని ప్రచారం నడుస్తోంది. మంత్రి పదవులే కాదు.. శాఖల కేటాయింపుల్లోనూ సామాజిక న్యాయంకు ప్రాధాన్యత నివ్వాలని కాంగ్రెస్ అధిష్టానం పేర్కొంది. కొందరు మంత్రుల పనితీరు సరిగా లేదంటూ ఇప్పటికే కొందరు పార్టీ నేతలు అధిష్టానానికి నివేదించారు. అలాగే మంత్రుల పనితీరుపై ఇప్పటికే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి నివేదిక ఇచ్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, వివిధ స్థాయి నేతలతో భేటీలో అందిన సమాచారం ఆధారంగా ఆమె నివేదికలు రూపొందించారు. కీలక శాఖల బాధ్యతలు అన్ని కొందరు మంత్రులే నిర్వహిస్తుండటంతో పని భారం కారణంగా కొన్ని శాఖల్లో ఆశించిన ఫలితాలు రావట్లేదనే అంచనలో కాంగ్రెస్ ముఖ్య నేతలు ఉన్నారు. మంత్రుల పనితీరు వ్యవహార శైలిపై కేసి వేణుగోపాల్ గతంలోనే ఢిల్లీలో సమావేశం నిర్వహించి సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రభుత్వ పాలనా వ్యవహారాలు, మంత్రుల వ్యవహార శైలి, పనితీరుపై తన అంచనాలను అధిష్టాన ముఖ్యులతో సీఎం రేవంత్ రెడ్డి పంచుకున్నారు. విద్య, మున్సిపల్ పట్టణాభివృద్ధి, హోం, న్యాయం సహా పదికి పైగా కీలక శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉన్న మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖను విడగొట్టి మున్సిపల్ శాఖను మరొకరికి ఇచ్చే అవకాశం ఉంది. కాగా తనకు విద్యుత్తు లేదా విద్యా శాఖ ఇవ్వాలని వివేక్ కోరుతున్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వద్ద విద్యుత్ శాఖ ఉంది. త్వరలో కొన్ని కార్పొరేషన్ చైర్మన్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా తెలంగాణలో కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖల కేటాయింపు పై హస్తినలో కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయి దాదాపు గంట సేపు చర్చించారు. మంత్రులకు శాఖల కేటాయింపుపైనే ప్రధానంగా వీరి చర్చ సాగినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఎవరెవరి దగ్గర ఏయే శాఖలున్నాయి? రెండు, మూడు మంత్రిత్వ శాఖలు నిర్వహిస్తున్న వారెవరు? కొత్తగా మంత్రివర్గంలో చేరిన వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు ఏ శాఖలు కేటాయించాలి? అనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు సమాచారం. దీనికి సంబంధించిన జాబితాను కేసీ వేణుగోపాల్‌కు సీఎం రేవంత్ అందించినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలను కొత్తవారికి కేటాయించే అంశంపై సమాలోచన జరిగినట్టు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం ఎవరికీ కేటాయించని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. అందులో ప్రధానమైనవి.. విద్య, పురపాలకం, హోం, గనులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమం, వాణిజ్య పన్నులు, పశుసంవర్ధక శాఖ, న్యాయ, కార్మిక, క్రీడలు యువజన శాఖ సీఎం వద్దే ఉన్నాయి.

ఫ్లాష్.. ఫ్లాష్..!

## జనగామ ఎమ్మెల్యే

# పల్లాకు అస్వస్థత

- కేసీఆర్ ఫాం హౌస్‌లో జారిపడిన రాజేశ్వర్ రెడ్డి
- హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలింపు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం జనగామలో పలు కార్యక్రమాలకు హాజరైన పల్లా సాయంత్రం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఎర్రవల్లి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడ జారి పడడంతో కాలుకు గాయం అయినట్టు తెలుస్తోంది. దీంతో ఆయనను అంబులెన్స్‌లో హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. కాగా ఎప్పుడు యాక్టివ్‌గా ఉంటే పల్లా రాజేశ్వర్‌రెడ్డి జారి పడడం ఏంటని కార్యకర్తలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.





# యోగా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** 11వ అంతర్జాతీయ యోగా ఉత్సవాల సందర్భంగా డిపార్ట్మెంట్ ఆఫ్ ఆయుష్ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగ ప్రాణ యామంతో పాటు ధ్యానం చేయడం వలన శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఆరోగ్యాన్ని పెంపొందించు కోవచ్చునని, తద్వారా నిత్యం ఉల్లాసంగా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. ఈ నెల 21న మినీ స్టేడియంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రజలు, జిల్లా అధికారులు తప్పనిసరిగా పాల్గొని జయప్రదం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జునరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్, జిల్లా అధికారిని డాక్టర్ మమత, డిపిఎం కుమార్ పాల్గొన్నారు.






# ప్రజాసేవకే అంకితమై రఘుపాల్

## ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు కామ్రేడ్ గంగసాని రఘుపాల్ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కొనియాడారు. జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హల్ లో మంగళవారం జరిగిన మాజీ సీపీఎం హైదరాబాద్ నగర కార్యదర్శి, పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ గంగసాని రఘుపాల్ సంస్మరణ సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుపాల్ చిత్రపటానికి పూలమాల వేసి, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ జిల్లా వాస్తవ్యులు వీర తెలంగాణ పోరాటానికి గర్భనాబై జనగామ ప్రాంతంలో పుట్టి, ఈ రాష్ట్రంలో ఆనాడు ఆంధ్రప్రదేశ్ లో ఈనాడు తెలంగాణలో హైదరాబాద్ నగరానికి సీపీఎం పార్టీ కార్యదర్శిగా అనేక సంఘాలకు బాద్యులుగా పనిచేసిన కామ్రేడ్ రఘుపాల్ మరణం దురదృష్టకరం అన్నారు. ఈ సందర్భంగా రఘుపాల్ కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు నా హృదయపూర్వక సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. కామ్రేడ్ రఘుపాల్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని, ఆయన చేసిన పోరాటాలు, సమాజం కోసం చేసిన కృషి మరువలేనివని కొనియాడారు. 1984లో వామపక్ష ఉద్యమ సమయంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నప్పుడు, 1984 నుంచి 1991 వరకు హైదరాబాద్ నగర ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా పనిచేసినప్పుడు గైడెన్స్ ఇచ్చిన నాయకుడు రఘుపాల్ అని, ఆ సమయంలో ఆయన జిల్లా కార్యదర్శిగా, తాను ఎస్ఎఫ్ఐ కార్యదర్శిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. రఘుపాల్ కులం, మతం గురించి మాట్లాడే వ్యక్తి కాకుండా, పేద ప్రజల హక్కుల కోసం పనిచేశారని అన్నారు. రఘుపాల్ తన జీవితాంతం పేద ప్రజల హక్కుల కోసం, భూస్వామ్య వర్గం నుంచి వచ్చిన దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, డాక్టర్ గోపాల్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు సూడి కృష్ణారెడ్డి, జనగామ, సిద్దిపేట జిల్లాల కార్యదర్శులు మోకు కనకారెడ్డి, ఆముదాల మల్లారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, సాంబరాజు యాదగిరి, సింగారపు రమేష్, బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజయేందర్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శివరాజ్ జన్మదినం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో శివరాజ్ కేట్ చేసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, చేర్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, జనగామ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ నామాల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్, యూత్ కాంగ్రెస్ జనగామ మండల అధ్యక్షుడు ప్రకాష్ యాదవ్, జనగామ 5వ వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు, యశ్వంతపూర్ గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగరాజు, సోషల్ మీడియా నాయకులు రాజశేఖర్, అరవింద్ గౌడ్, జరుర్, రాజు తదితరులు పాల్గొన్నారు.



# మధ్యాహ్న భోజనంపై వంట కార్మికులకు శిక్షణ

**నర్మెట, మన చౌరాస్తా :** విద్యార్థులకు రుచికరమైన పోషకాహారాన్ని అందించాలని చేశామని మండల విద్యాధికారి మడిపల్లి ఐలయ్య పేర్కొన్నారు. పరిశుభ్రత, మెనూ ప్రకారం మంచి బలవర్ధకమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించేందుకు వంట కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. హనుమంతపూర్ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సామల కమల, అసిస్టెంట్ సెక్రటరీ దూడల రమేష్, ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్, కేశవరావు, ఉప్పలయ్య, సునీల్ , రామరాజు, అరుణ, సీఆర్పీ రవీందర్ లాల్, వివిధ పాఠశాలల వంట కార్మికులు పాల్గొన్నారు.




# విద్యార్థులకు అన్ని భాషలపై పట్టు ఉండాలి

**వరంగల్, మన చౌరాస్తా :** విద్యార్థులకు అన్ని రాష్ట్రాల భాషలపై పట్టు ఉండాలని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సుభాషిని అన్నారు. ఈ నెల 2 న ప్రారంభమైన భారతీయ భాష సమ్మర్ క్యాంప్ మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గత పది రోజులుగా మన రాష్ట్ర తెలుగు భాషతోపాటు తమిళనాడు రాష్ట్రం యొక్క భాష తమిళ భాషను విద్యార్థులకు నేర్పించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఆ రాష్ట్రం యొక్క ఆచార వ్యవహారాలు, చారిత్రాత్మక ప్రదేశాలు, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు, వంటలు , సినీ ప్రముఖుల గురించి తెలిపారు. అలాగే తమిళ అక్షరాలు, సంఖ్యలు కూడా నేర్పించారు, శిక్షణలో భాగంగా విద్యార్థులకు తమిళనాడు ఫేవరెట్ డిష్ చక్కర పొంగల్ ను తయారు చేయించి విద్యార్థులకు చూపించారు. చివరి రోజు విద్యార్థులకు వివిధ రకాల కాంపిటీషన్స్ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ భారతీయ భాష సమ్మర్ క్యాంపులో సుమారుగా 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తమిళ శిక్షకులు రమ్య తదితరులు పాల్గొన్నారు.

మన చౌరాస్తా 3
11.06.2025 బుధవారం
Mana Chourasta

# ప్రజలందరినీ చల్లంగ చూడు తల్లి

**-చీటకోడూరులో ఘనంగా ఎల్లమ్మ పండుగ**
**పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం చీట కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ గ్రామ ప్రజలందరినీ అమ్మవారు కాపాడాలని, సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని, పాడిపంటలు బాగా పండాలని, వచ్చే వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసేలా ఆ తల్లిని మనస్ఫూర్తిగా వేడుకున్నానని తెలిపారు.



## ఆప్యాయంగా పలుకరిస్తూ..

చీటకోడూరులో రేణుక ఎల్లమ్మ దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా, అమ్మవారికి బోనాలు ఎత్తుకుని వెళ్తున్న మహిళలను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. బోనాల ఉత్సవంలో పాల్గొంటున్న వారి భక్తి, సంప్రదాయానికి అద్భుతమైన నిదర్శనంగా ఇవి నిలుస్తున్నాయని ప్రశంసించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రతి ఇంటా సుఖశాంతులు వెల్లివిరాలని, గ్రామానికి పాడిపంటలతో పాటు అభివృద్ధి వరాలుగా వరించాలని ఆకాంక్షించారు.

# యోగ ప్రాణాయామంతో ఏకాగ్రత

**చిట్యాల, మన చౌరాస్తా :** యోగ ప్రాణాయామం చేయడం వల్ల జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవుతుందని మండల విద్యాశాఖ అధికారి సైదా నాయక్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ హైస్కూల్లో 11వ అంతర్జాతీయ యోగా మాసోత్సవాల సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆయుష్ డిపార్ట్మెంట్ చిట్యాల హోమియో డిస్పెన్సరీ ప్రధానోపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులకు యోగ పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగ ద్వారా చర్మాన్ని కాపాడుకోవచ్చని సర్వంగాసనం వంటి ఆసనాలు రక్తప్రసరణను మెరుగుపరుస్తాయని, బాడీ ఫిట్ గా ఉండాలంటే ఎలాంటి ఎక్విప్మెంట్స్ లేకుండా సాధన చేయవచ్చని అన్నారు. గుండె ఆరోగ్యానికి హాని కలిగించే కొలెస్ట్రాల్ హైబీపీ అధిక బరువు కంట్రోల్ చేయడంలో యోగా ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. యోగా ఇన్స్ట్రక్టర్ కేబి ప్రసాద్ మాట్లాడుతూ సహజ కండరాల బలం శక్తిని మెరుగ్గా చేసేందుకు నొప్పుల నుండి రిలీఫ్ కోసం యోగా చేయవచ్చని దీనివల్ల కీళ్ల నొప్పులు వెన్నునొప్పి మోకాళ్ళ నొప్పులు తగ్గించడంలో యోగా ఎంతగానో సహాయపడుతుందని, విద్యార్థులకు పాఠశాలలో కచ్చితంగా యోగ సాధన చేయించడం వల్ల అనేక మంచి ప్రయోజనాలు కలుగుతాయని, ఉత్తమ ఫలితాలను పొందవచ్చని అన్నారు. అనంతరం హరిత యోగ కార్యక్రమంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మాధవి, హోమియో డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తయ్యిబా కౌసర్ , హోమియో డిస్పెన్సరీ ఫార్మసిస్ట్ సరిత, మహిళా యోగ ఇన్స్ట్రక్టర్ కన్నబోయిన వైష్ణవి, ఆశా వర్కర్లు సైదమ్మ, జయమ్మ, శైలజ,గీత, రజిత, కవిత, అంగన్వాడి టీచర్ అపర్ణ తదితరులు పాల్గొన్నారు.






## కొమ్మినేని శ్రీనివాస్ అరెస్ట్‌పై
# జర్నలిస్టుల నిరసన

**జనగామ, మన చౌరాస్తా :** ఆంధ్రప్రదేశకు చెందిన సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్‌ను ఖండిస్తూ మంగళవారం జనగామ జిల్లా కేంద్రంలో జర్నలిస్టులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజా రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్‌మాట్లాడుతూ కొమ్మినేని శ్రీనివాస్ ను అరెస్ట్ సరికాదన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తేవాలన్నారు. కార్యక్ర మంలో సీనియర్ జర్నలిస్టులు కన్న పరశురాములు, ఇర్రి మల్లారెడ్డి, కొత్తపల్లి కిరణ్, కాసాని ఉపేందర్, హింగె మాధవరావు, జాల రమేశ్, ఉప్పలంచి నరేందర్, భిక్షపతి,కన్నారపు శివ శంకర్, గోవర్ధనం వేణు, కేమిడి ఉపేందర్, బండి శ్రీనివాస్, గణేశ్, వినయ్, యూసూఫ్, ఉపేందర్, మణి, ఏజాజ్, ఆశిష్ , హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానికులకే ఉద్యోగాలు : సీతక్క

**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఏజెన్సీ ప్రాంతాల్లోని ఉద్యోగాలు స్థానికులకే దక్కేలాగా జీఓ నెం.3ను పునరుద్ధరించాలన్న పక్రియను ప్రభుత్వం ప్రారంభించిందని మంత్రి సీతక్క తెలిపారు. వెనకబడ్డ ఉట్నూరు, ఏటూరునాగారం ఐటిడిఎల అభివృద్ధికి రూ. 12 కోట్లు ప్రత్యేకంగా కేటాయించినట్లు వెల్లడిరచారు. మంగళవారం మంత్రి సీతక్క అధ్యక్షతన మాసబ్ ట్యాంక్ లోని సంక్షేమ భవన్ లో గిరిజన, ఆదివాసి ఎంఎల్ఎల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కానున్న డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్, ఎంఎల్ఎలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు పటేల్, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఆదినారాయణ, ట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్, జిసిసి ఛైర్మన్ కోట్నాక్ తిరుపతి, ట్రైబల్ సెక్రటరీ శరత్, ఎస్‌టి గురుకుల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మిూ, అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి, జిసిసి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు. రూ. 1,000 కోట్లతో రాజీవ్ యువ వికాశం, రూ. 12,600 కోట్లతో ఇందిర సౌరజల గిరి వికాసం, రూ.17,168 కోట్లతో ఎస్‌టి ఎస్‌డిఎఫ్ నిధులతో గిరిజనుల విద్య, ఆరోగ్యం, వసతి, ఉపాధి, మౌలిక వసతుల కల్పన వంటి ప్రజా ప్రయోజన పథకాలు అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు సమావేశం ధన్యవాదాలు తెలిపింది. ఏజెన్సీ పాంత్రాల్లో అటవీ శాఖ అధికారుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను ఎంఎల్ఎలు మంత్రి దృష్టికి తెచ్చారు. తడోబా టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వు మధ్యలో ఉన్న ప్రాంతాన్ని కొమురం భీం కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ తెచ్చిన జీఓ నెం.49ను ఉపసంహరించుకోవాలని ఎంఎల్ఎలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.